# భారతి

క్యాంపు నుండి చీకటిపడి వచ్చాను. వచ్చేపాటికి బాబాయి వచ్చివున్నారు. బాబాయే రాకుంటే ఆనాటికి బద్దకించి భోజనం మానివేసేవాణ్ణే! జమాను రంగయ్యను పంపించి క్యారియర్ తెప్పించాను.

"భోజనంనిండా రాళ్ళే"

"అబ్బా!" అన్నాను పంటి క్రింద రాయిపడ్డప్పుడు.

"అందుకేరా నాయినా ఒక ఇంటివాణ్ణి కమ్మంటోంది" బాబాయి ప్రారంభించారు తన మామూలు పాతాన్ని. నా వివాహమనే బృహత్తర ప్రణాళికలో బాబాయి అతిముఖ్య పాత్రధారి. ఆ ప్రణాళికా విజయానికి తన యావచ్ఛక్తిని ధారపోస్తున్నారాయన.

బాబాయికి సమాధానంగా, గతంలో లాగనే నా విముఖతను రంగరించి ఓ పొడినవ్వు నవ్వాను.

రాత్రి ఊసుపోక కబర్లయ్యాక తమలపాకులు నములుతూ బాబాయి ప్రారంభించారు- "ఏరా నాయినా! నా మాట విను. ఎన్నాళ్ళని బాధపడతావు? మంచి సంబంధం చూచాను. కావాలని కాళ్ళ దగ్గరకు వచ్చారు. కాదనక ఒక ఇంటివాడవయితే స్వర్గానవున్న అన్నయ్య , వదినల ఆత్మలు సంతృప్తి చెందుతాయి, పెంచి పెద్దచేసినందులకు నా బాధ్యతా తీరుతుంది-" అంటూ.

బాబాయి నాకు పూజ్యులు. ఆయన యెడల నా కున్న భక్తిప్రపత్తులు అనన్యాలు.. కాని నా వివాహ విషయంలో ఆయన మాటలు కాదనవలసి వస్తోంది. ఏం చేయను?

నా సమాధానంతో బాబాయి ఆయన చివరి ప్రయత్నం విఫలమయినట్లు బాధపడి పోయారు.

"మురారీ, నీకు వివాహమంటే ఎందుకీ ద్వేషం?" అని ప్రశ్నించారు బాబాయి.

"స్త్రీ" అన్నాను

బాబాయి చకితుడై తర్వాత ముఖంలోకి తరచి చూచారు క్షణ కాలం.

"స్త్రీ అంటేనే విముఖత కలిగిందా? స్త్రీ అంటే నీకేమర్థమయింది?" అన్నారు నిట్టూర్చి.

పగలంతా ప్రయాణంచేసి వచ్చారేమో అలా మాట్లాడుతూనే నిద్ర పోయారు బాబాయి.

బయట వర్షం సన్నగా ప్రారంభమయింది. కిటికీ నుండి చలిగాలి వేసింది, స్త్రీలోని అసూయలా.

'స్త్రీని గురించి నీకే మర్థమయిం'దని, అన్న బాబాయి మాటలు ధ్వనించాయి చెవులలో... అర్థం చేసికొన్నాను. స్త్రీ అంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసికొన్నాను. నా జీవితంలో తారసపడిన స్త్రీలే, స్త్రీ అంటే ఏమిటో నిర్వచనం చెప్పుకొన్నారు. కిటికీ గుండా తళుక్కుమన్న మెరపు కన్పించింది. నా స్మృతిపథంలో పార్వతి నిలచింది.

సరిగ్గా 8 సంవత్సరాల క్రితం... నా 22 ఏళ్ల యవ్వనంలో... నా జీవితపథంలో పార్వతి ఇలాగే మెరసింది. అప్పట్లో గుంటూరులో బి.ఎ. చదువుతూ వుండేవాడిని, దూరపు బంధువు శాంతమ్మ అత్తయ్యగారింటిలో వుంటూ. పార్వతి ప్రక్కింటి ప్లీడరుగారి కూతురు. శాంతమ్మ అత్తయ్య దగ్గరకంటూ వచ్చి నా యెదలో తారట్లాడింది. ప్లీడరుగారు ఓనాడు పిలిచి, 'మా పార్వతి తెలుగులో మందమతి, కొద్దిగా తెలియనివి చెవుతూవుండు' అని కోరారు. పార్వతి మా కాలేజీయే! ఇంటరు చదువుతూ వుండేది.

పార్వతి మనుచరిత్ర పద్యాలకు అర్థం చెప్పనిచ్చేది కాదు. చిలిపిగా నవ్వి,"మురారీ ప్రవరుడు అసలున్నాడంటావా?" అనేది. ఆ ప్రశ్న నా కర్థమయ్యేది కాదు. కిల కిల మని నవ్వేది. వెల్వెట్టు మీద ముత్యాల సరాలను త్రెంచి దొరలించి నట్లుండే దానవ్వు.

"అలా చూస్తారేం మురారీ.. వరూధిని అంత పిచ్చిగా ప్రవరాఖ్యుని కోసం తపించిందటే ఎలా నమ్మటం...?" అనేది! "పోనీ నీ హృదయాన్నడుగు" అనేది. పార్వతి కనుసన్నలు నన్ను ఆజ్ఞాపించేవి. చేతిని హృదయం పైన వేసికొనేవాణ్ణి. ఆ హృదయ వేగం నన్ను కలవరపెట్టేది. కనులు మూతలు పడేవి. మరల కనులు తెరచేపాటికి పార్వతి కనుమరుగై నన్ను కవ్వించేది.

పార్వతి మెరుపులాగానే మెరిసింది నా జీవితంలో. పిచ్చివాణ్ణి అయ్యేవాణ్ణి, పార్వతిని చూస్తూ. 'ప్రేమంటే అదేనేమో!' అనిపించేది.

"పార్వతీ నిన్ను ప్రేమించాను" అన్నాను; ఒకనాటి సాయంత్రం డాబాపై ఒంటిరిగా మేమిద్దరం వున్నప్పుడు. పార్వతి తల వంచేసుకుంది. అలా తల వంచేసుకొనే గబ గబా వెళ్ళిపోయింది. అలా వెళ్ళి పోతున్నప్పుడు ఆమెలో తొణికిస లాడిన చిరునవ్వు నా దృష్టి పథాన్ని తప్పించుకో లేకపోయింది. ఆ చిరు నవ్వు చుట్టూ ఆశాసౌధాలను నిర్మించాను. ఆ చిరునవ్వును తెచ్చి నా హృదయంలో దాచుకొన్నాను.

ఏ పార్వతి అయితే నాది అనుకొన్నానో, ఏ పార్వతిని నా హృదయ మనుకొన్నానో, ఆ పార్వతి నాకు ద్రోహం చేసి, దూరంగా తొలగిపోయింది. సెలవలకు వెళ్ళి తిరిగి వచ్చేపాటికి తన మేనమామను పెళ్ళి చేసికొని జలంధర్ వెళ్ళిపోయింది.

నా ఆశాసౌధాలు కూలి గాలికి కొట్టుకొని పోయాయి. నా హృదయం శిథిలమయింది. నా భావం అభావమయింది. దారినే పోతున్నవాణ్ణి పిలిచి చెంపదెబ్బ కొట్టినట్లు ఏమిటీశిక్ష నాకు...?

ఆనాడే నాకు స్త్రీ అంటే ఏమిటో కొద్దిగా గోచరమయింది.

పైగా ఓ జాబు వ్రాసి పనిపిల్లకు ఇచ్చివెళ్ళింది; "మురారీ! పరిస్థితులను

ఎదుర్కోలేకపోయాను. నేను స్త్రీని - క్షమించు" అని. స్త్రీలోని 'ద్రోహ లక్షణాన్ని' ఎంత చక్కగా దిద్దితీర్చిందో పార్వతి ఆ జాబులో!

దాచుకొన్న పార్వతి ఫోటో చింపి తుంపులు చేసివేసాను. హృదయంలోని పార్వతీ అన్ని తుంపులయింది. జీవితంలో అడుగు పెడుతూనే వేసిన అడుగు అపస్వరాన్ని పల్కింది. అందుకే కొంచెం దూరదృష్టితో, విచక్షణాజ్ఞానంతో కాలాన్ని నెట్టివేయాలని ప్రయత్నించటం మొదలెట్టాను.

విశాఖపట్టణంలో ఉద్యోగమయింది. వెళ్ళి చేరాను.

భుజంగరావు మామయ్య దగ్గరనుండి అభినందనలతో, ఆశీస్సులతో జాబు వచ్చింది. ఆ జాబులోనే వచ్చి 'సరళను చూచి పొమ్మని కూడ వ్రాసారు. 'సరళను ఈనాడు ప్రత్యేకంగా నేను చూచేదేముంది...?' అనిపించింది. నా మౌనం మామయ్య నుండి మరో రెండు జాబులను తెప్పించింది. మూడోసారి మామయ్యే వచ్చేసారు, పిఠాపురం నుండి. పైపంచ నడుంకు చుట్టుకొని బ్రతిమిలాడుతున్న భంగిమలో- "ఏరా మురారీ! మన సంబంధాలురా" అంటూ ఆనాడే బాబాయి నుండి సరళను సిఫార్సు చేస్తూ జాబు వచ్చింది.

"సరళ ప్రాణం అంతా నీ మీదే వుంది నాయినా! చిన్ననాటి నుండి అది నీ భార్యే! అంటూ మామయ్య అంతటివాడు నా చేతిని పట్టుకొన్నారు.

"సరళను నేను చూచేదేముంది మామయ్యా!" అన్నాను.

"కాదు నాయినా, ఇవ్వన్నీ వేడుకలు! ఆలవాట్లు" అంటూ బ్రతిమాలారు. అలాగే... పిఠాపురం వెళ్లాను.

తలవంచుకొని 'రతీ' దేవిలా కన్పించింది సరళ. చిన్ననాటి సరళను తలచుకొన్నాను. కాలం తెచ్చిన వంపు సొంపులతో ఎంతో అందంగా కన్పించింది.

సరళ సమక్షంలోనే మరికొన్ని క్షణాలైనా వుండక అప్పుడే తిరిగి వచ్చేసేనేమా అనిపించింది, తీరా విశాఖపట్టణం తిరిగి వచ్చేశాక.

పిఠాపురంలోనే నా ఇష్టాన్ని తెల్పాను. మామయ్య నిలువెల్లా పొంగిపోయాడు. పై కండవా జారిపోతుంటే, గమనించకుండా లోనికి పరుగెత్తాడు, అత్తయ్య కీ విషయాన్ని చెప్పటానికి. అత్తయ్య ఆనందంతో పొరలి పోయింది.

ఒకనాడు పోస్టులో బాబాయి శుభలేఖలు పంపారు, అచ్చు వేయించి. ఆనాడల్లా నా హృదయంలో మణిదీపాలు వెలిగించినట్లైంది. స్నేహితులందరికీ శుభలేఖలు పంచిపెట్టి అందరినీ ప్రయాణానికి సిద్ధం చేశాను.

సరిగ్గా పెళ్ళి మూడు రోజులుందనంగా, నేను పెట్టి, బేడా సర్దుతూండగా బాబాయి నుంచి టెలిగ్రాం వచ్చింది - "పెళ్ళి ఆగిపోయిం'దని.

ఆశ్చర్యపోయాను. మరునాడు బాబాయి జాబు చూచుకొని నా ఆశ్చర్యాన్ని అవమానంగా మార్చుకొన్నాను.

"సరళకు నేను ఇష్టంలేదట!"

ఈ విషయాన్ని ఇన్నాళ్ళు సరళ ఎందుకు తెలియ పరచింది కాదు-? దానికి 'సరళ' సమాధానం- "డాక్టరుగారబ్బాయి తన అభీష్టాన్ని ఈ నాడే తెలియ చేశాడు" అనిట.

ఎంతటి తంత్రం...?

జీవితంలో రెండవసారి 'స్త్రీ' అనే విశ్వాసఘాతపు సుడిగుండంలో పడి పోయాను. అసహ్యం వేసింది. 'ఎందుకు నాకీ శిక్ష?' అనిపించింది. సమాధానం లేదు. అంతే!

స్త్రీకి పురుషుడంటే ఎందుకీ తేలిక భావం...? స్త్రీ అంటే జుగుప్స గలిగింది. ఆ నాటి నుండి నాలో స్త్రీ ద్వేషం అలముకొంది. నలుగురు స్త్రీలున్న చోట్లకు వెళ్ళడానికి మనసొప్పేది కాదు.

కాలాన్ని నిర్లిప్తంగా, మౌనంగా గడిపివేయాలని నిశ్చయించుకొని దానికి అలవాటు పడ్డాను. బాబాయి ఒకటి రెండు సార్లు జాబులు వ్రాసారు - 'మామయ్య మీద పంతానికి సరళను తలదన్నిన సంబంధాన్ని తీసికొస్తా'నని. సరళ యెడల నాకు మిగిలిపోయిన భావం ఒకటి. దానికి తలదన్నిన సంబంధమంటే? అయినా ఎవరైతేనేం... అంతా స్త్రీ జాతే - అని పించింది.

వద్దని జాబు వ్రాసాను.

విశాఖలో మహారాణి పేటలో ఒక గదిలో చేరాను. ప్రక్క భాగంలో క్రొత్తగా వివాహమయిన లెక్చరరు, ఆయన భార్య వుండేవారు. ఆయన, మాధవరావు,

భార్య అంటే పంచ ప్రాణాలుగా వుండేవాడు. ఆమెను సంతోష పెట్టడానికి ఎంతో జాగ్రత్త వహించేవాడు. అలాంటి సమయంలో ఓసారి ఏదో గిల్లి కజ్జా పెట్టుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఒకటి రెండు రోజులు భార్య తిరిగివస్తుందనే ఆశతో వుండిపోయాడు మాధవరావు. మూడవనాటికి పిచ్చివాడిలా అయిపోయాడు.

"ఏమండి, లలిత తిరిగి వస్తుందంటారా?" అని ప్రశ్నించేవాడు. నాకు జాలి వేసేది. రెండు వారాల తరువాత, "నీకు నేను కావలిస్తే ఇక్కడకేవచ్చి ఉండవచ్చు" అనే జాబు చూచుకొని మాధవరావు పిచ్చివాడే అయ్యాడు. ఆస్పత్రి పాలయ్యాడు.

ఆంజనేయుడి గుడి ప్రక్క మఠంలో వుండే సన్యాసి ఒకనాడు చిన్న వేదాంతోపన్యాస మిచ్చాడు - "మానవునికి, అరిషడ్వర్గాలనబడే శత్రువులున్నాయి - వాటికన్నా ప్రమాదమైనది స్త్రీ" అని. దారినే పోతున్నవాడిని ఆగి విన్నాను. ఆ మరునాడు దారినే పోతున్న ఆ సన్యాసిని పిలచి, "మీరు నిన్న చెప్పింది నిజం" అన్నాను. ఓ గంటసేపు ఏవేవో మాట్లాడాడు... తన సన్యాసం... హృషీకేశం... పావనాశనం... ఎన్నో, చివరికి చెప్పాడు తనూ అందరిలాగానే జీవితాన్ని ప్రారంభించినవాడేనట. కాని భార్య శ్రీరంగం ఇద్దరి పిల్లల్ని వదలి వేసి, ఎవరితోనో, ఎక్కడికో లేచిపోయిందట. తాను సన్యాసి అయ్యాడట.

నాకు తెలిసిన వ్యక్తులను గురించి, ఒక్కసారి ఆలోచించాను. అన్నింటిలోను స్త్రీకే లాభించింది. ప్రతిసారీ పురుషుడే ఓడి పోతున్నాడు.

నా మనస్సులో స్త్రీ అంటే ఓ నిర్వచనం స్థిరపడి పోయింది.

★ ★ ★

ఉద్యోగరీత్యా... శ్రీకాకుళం జిల్లాలో ఓ నెల రోజులు 'ప్రణాళికా శిక్షణ'కు వెళ్ళవలసివచ్చింది. అక్కడే స్త్రీ జనాభ్యుదయ శాఖ నుండి వచ్చిన 'నీరజ' పరిచయమయింది. ఆ పరిచయాన్ని పరిచయంగానే ఉంచాను. నేనెంత దూరంగా జరగటానికి ప్రారంభించానో, నీరజ అంత దగ్గర కావటానికి ప్రయత్నించింది. నేను మరికొంచెం దూరంగా జరగటానికే ప్రయత్నించాను.

నీరజ, తన స్త్రీత్వాన్ని నా ముందుంచి ఓడించాలని ప్రయత్నించింది. కాని జీవితం నాకు నేర్పిన పాఠాలు నాకు దివ్వెలయి నన్ను కాపాడాయి.

ఆఖరిరోజు, "నీ స్థిరసంకల్పం. మనోనిబ్బరం నన్ను ముగ్ధుణ్ణి చేశాయి మురారీ -" అంది.

విశాఖ తిరిగి వచ్చిన కొద్ది రోజులకే నీరజ విశాఖకు బదిలీ అయి వచ్చింది. నన్ను చూచినప్పుడల్లా దూరంగా తొలగి, గౌరవాన్ని ప్రదర్శించి వెళ్ళిపోయేది. నా పరోక్షంలో నన్ను గురించి గొప్పగా చెప్పేది.

దూషణకు తొలగనివారు, భూషణకు పొంగని వారు వుంటారా? కొంచెం పొంగిపోయాను. స్త్రీ అయిన నీరజ మీద నా కుండవలసిన భావం అప్రయత్నంగా సడలింది. కాని జారి పోలేదు. ఆ సడలింపే, అప్పుడప్పుడు నీరజ నా గదికి వచ్చి పిచ్చాపాటి, లోకాభిరామాయణం మాట్లాడటానికి ఉపకరించిదేమో? ఆ సడలింపే నీరజ నన్ను వేరుగా అర్థం చేసికోవటానికి అవకాశం మిచ్చిందేమో...?

"మురారీ! నన్ను స్వీకరించి... మన జీవితాలను సుఖమయం చేయవా -" అంది.

పెద్దగా నవ్వాను. పిచ్చిగా నవ్వాను.

నీరజ తెల్లపోయింది.

"చూస్తూ చూస్తూ సల సల కాగుతున్న తైల భాండంలోకి అందులోనిది అమృతమంటూ భ్రమించి దూకలేను" అన్నాను.

నీరజ వెళ్ళిపోయింది.

స్త్రీ జాతి మీద నాకున్న కసిని, ద్వేషాన్ని తీర్చుకొన్నానని భావించాను. కాని తెల్లవారేసరికి నీరజ నన్ను అల్లరి పాలు చేసింది. నీరజను గదికి పిలిచి బలవంతం చేయటానికి ప్రయత్నించానట. నలుగురూ నన్ను పిలిచి చీవాట్లు పెట్టారు. నేను చెప్పిందల్లా అరణ్యరోదనయింది.

సృష్టిలో స్త్రీ తన స్వార్థాన్ని బలపరచుకొనటానికి "అబల" అనే బలమైన సాకును సృష్టించుకొంది. దాని ముందు పురుషుడు వధ్య పశువవుతున్నాడు.

ఆ అపనిందతో విశాఖలో ఉండలేకపోయాను. వెంటనే గుంటూరు బదిలీ చేయించుకొన్నాను.

గుంటూరు బదిలీ చేయించుకొన్నానన్నమాటే కాని నాకు శాంతి నశించింది.

గుంటూరు నిండా తెలిసినవారే! ప్రతివారు రోజుకు ఓ డజను సార్లు - "ఇంకా పెండ్లి చేసికోలేదే" మని ప్రశ్నించి - రెండు డజనుల సంబంధాలను గురించి మాట్లాడేవారే! పైగా, 'ఆ వనజ చూచావు బుద్ధిమంతురాలు. తలలోని నాల్క' అనీ; 'ఆ సీతారామయ్యగారి పెద్దమ్మాయి. 'ప్రియంవద' చాల సుగుణవతి - పని మంతురాలు' అనీ చెప్పటం ప్రారంభించారు.

నేను పెండ్లి చేసుకొనకపోతే ఈ లోకానికెందుకీ బాధ అనిపించింది. ఏవో సాకులు, కారణాలు చెపుతూ అలాగే, ఆ వాతావరణంలోనే కాలాన్ని వెళ్ళతీసాను. లోకం అంగీకరించే వివాహపు వయస్సు నాకు తప్పిపోయింది. 30వ పడిలో పడిపోయాను. కాని బాబాయి మాత్రం వదిలారు కారు నన్ను...

తుపానులో ఛిద్రమైన నౌక నుండి సముద్రం లోనికి జారిపోతూ, ఏ మాత్రపు గడ్డిపోచైనా నన్ను రక్షించదా అనుకొనే ప్రయాణీకుని ఆత్మవిశ్వాసంలా... బాబాయికి యింకా నా మీద, నా పెండ్లి మీద నమ్మకం.

వాత్సల్యసముద్రుడాయన.

★ ★ ★

పెద్దగా ఉరిమి తళుక్కున మెరపు మెరిసింది. గత స్మృతుల నుండి తేరుకొన్నాను. ఎదురుగా టిక్కు టిక్కు మంటూ గడియారం ఒంటి గంట చూపిస్తోంది. చలిగాలి స్త్రీ లోని కసిలా వెంటాడి బాధపెట్టింది.

దుప్పటి కప్పుకొని పడుకొన్నాను.

తెల్లవారుఝామున జవాను వచ్చి నిద్ర లేపాడు. 'క్యాంపుకు వెళదామన్నారు కదా?' అంటూ. తర్వత్వరగా స్నానం ముగించి బట్టలు ధరించి బయలు దేరాను. బాబాయి నిద్ర నుండి లేవలేదు. టేబులు మీద ఓ జాబుంచి క్యాంపు వెళ్ళిపోయాను.

"బాబాయ్!

స్త్రీ అంటే ఏమర్థం చేసికొన్నావు అన్నావు... అర్థం చేసికొన్నాను. ఎంతో అర్థం చేసికొన్నాను. స్త్రీ ద్రోహి... స్త్రీ భ్రమ... స్త్రీ స్వార్థం... ఇలా... నాలో యింతటి స్త్రీ ద్వేషం వుంది. ఇంకా నాకు పెళ్ళేమిటి.? ఈ జన్మ ఇలా గడచి పోవలసినదే! నన్ను క్షమించు. - మురారి."

బహుశా ఆ జాబు చూచుకొని బాబాయి మరో నిట్టూర్పు విడచి వుంటారు.

అంతకంటే నేనేం చేయను-?

రాత్రికి చాలా చీకటి పడి క్యాంపు నుండి తిరిగి వచ్చాను. బాబాయి లేరు. కాని... బదిలీ కాగితం మాత్రం సిద్ధంగావుంది - నన్ను భద్రాచలం బదిలీ చేసినట్లు.

★ ★ ★

భద్రాచలం మన్య ప్రాంతం రాత్రిం బవళ్ళు చాకిరి. క్యాంపు నుండి రాత్రి పూట చాలా ప్రొద్దుపోయి రావలసి వచ్చేది. అక్కడ జవాను కూడ లేడు. ఒక్కొక్కసారి తిండి తిప్పలు దొరికేవి కావు. చిన్నగా ఆరోగ్యం దెబ్బతినటం ప్రారంభించింది. కాని ఏం చేయటం...? విశ్రాంతి మృగ్యమయింది.

చిలికి చిలికి గాలివాన అయినట్లు ఆరోగ్యం దెబ్బతింది, పూర్తిగా. ఒకసారి క్యాంపులోనే జ్వరం తగిలింది. అలాగే తిరిగి వచ్చాను రాత్రి పూట. తెలిసీ తెలియని స్థితిలో ఏలాగో ఆఫీసు నుండి ఇల్లు చేరి, మంచం మీద వాలి పోయాను. మూడవ రోజు తెలివి వచ్చింది. నీరసంగా కళ్ళు తెరచి పరికించాను. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. నా మంచం ప్రక్కన బల్లపై పండ్లు, మందులూ వున్నాయి. చిందర వందరగా పారవేసి వుండే పుస్తకాలు ఒక క్రమంలో అమర్చబడి వున్నాయి. ఆశ్చర్య పోయాను. మెల్లగా లేవటానికి ప్రయత్నించాను.

"మీరు నీరసంగా వున్నారు - కదలకండి"

ఆ దిక్కుగా చూచాను. కిటికీ దగ్గర చేతిలో పుస్తకంతో ఓ స్త్రీ కన్పించింది. పరికించి చూచాను. భారతి! నే నుంటున్న ఇంటియజమానిగారమ్మాయి.

"మూడురోజుల క్రితం మీ శరీరం జ్వరంతో కాగిపోయింది. మూలుగులు విన్పించాయి. నాన్నగారు డాక్టర్ని తీసికొనివచ్చి చూపించారు."

అవును లీలగా జ్ఞాపకానికి వచ్చింది.

"కృతజ్ఞుణ్ణి" అన్నాను.

"మీరింకా పూర్తిగా కోలుకోలేదు. పూర్తి విశ్రాంతి అవసరంట. విశ్రాంతి తీసికొండి. మీకు కావలసినవన్నీ నేను సమకూర్చుతూ వుంటాను. నాన్న బడికి వెళ్ళారు -" అంటూ మందు గ్లాసు కడుక్కొని రావటానికి వెళ్ళింది భారతి.

భారతి తండ్రి శివకామయ్యగారు వీధి బడి పంతులు. భారతి ఆయన ఏకైక సంతానం.

భారతి!!!

ఒకటి రెండు సార్లు చూచానేమో నేనక్కడున్న ఆరు నెలల్లోను. ఆమెకు వివాహమయింది. కాని శివకామయ్యగారి దగ్గరే వుంటోంది. భారతిని చూస్తుంటే ఏదో వాడిపోతున్న లతను చూస్తున్నట్లుండేది. ధూళిలో కలసిపోతున్న పుష్పాన్ని చూస్తున్నట్లుండేది.

రాత్రికి శివకామయ్యగారు వచ్చారు. నా కృతజ్ఞత ప్రకటించాను. ఆయన ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు.

"ఏమిటో నాయనా! గొర్రె తోక లాంటి ఉద్యోగ జిజ్ఞాసలో పడి ఏనాడూ మిమ్మల్ని గురించి ఆలోచించాను కాదు... అయినా ఆరోగ్యాన్ని అంతగా పాడుచేసికొంటే ఎలాగా..." అన్నారాయన.

మౌనంగా వుండి పోయాను.

"జీవితమంటే విసుగు చెందిన వాడిలా కన్పిస్తున్నారు మీరు... ఇవి నా మాటలు కావు. మా భారతి అంది. నిర్లక్ష్యంగా వుంటున్నారట. ఇంత చిన్న వయసులో మీకీ వైరాగ్యమేమిట?" అన్నారు శివకామయ్యగారు.

అంతలోనే భారతి వేడినీళ్ళూ మాత్రా తీసికొని వచ్చింది - "తీసికొండి' అంటూ. ఆ చేదుమాత్ర మ్రింగటమంటే...? కాని భారతిని చూస్తే అదో విధమైన భయం వేసింది. మాట్లాడకుండా మ్రింగాను. 'నాన్నా! ఇక వారిని విశ్రాంతి తీసికోనివ్వండి' అని శివకామయ్యగారిని తీసికొని పోయింది.

"ఏమిటీ భారతి?" అనిపించింది. మరునాటి రాత్రి భోజనం చేసి కులాసా కబుర్లు చెప్పటానికి వచ్చారు శివకామయ్యగారు. ఆయన ఏవేవో చెప్పుక పోయారు. ఆ ప్రసంగం అటు తిరిగి ఇటు తిరిగి, ఆయన జీవితం ఆయనకు నేర్పిన పాఠాలపైకి... జీవితంలో ఆయన కెదురైన సుడిగుండాలకేసి మళ్ళింది.

"భగవంతుడు నన్నన్నిందాలా అన్యాయం చేసాడు... జానకి పోయింది.

ఇక నా జీవితమే ఎందుకనుకొన్నాను. కాని భగవంతుడు ఈ బంధాన్ని మిగిల్చి వెళ్ళాడు" అన్నారాయన భారతి నుద్దేశించి మాట్లాడుతూ.

"భారతి నాకొక సమస్య" అన్నారాయన.

కాదూ మరి? నిక్షేపంగా పెళ్ళయిన కూతురు కాపురం చేసికొంటూ వుంటే సంతోషించగలడు కాని... ఇలా అన్యాయమై పోతే ఏ పితృ హృదయం సహించగలదు-?

భారతి భర్త రాజారావు ఎవరితోనే వెళ్ళిపోయాట్ట. ఈ అపరంజి బొమ్మ నెలా వదలి వేయగల్గాడో.....! 'ప్రపంచంలో అన్యాయాలు అందరికీ జరుగుతూ వుంటాయా?' అనిపించింది మొదటిసారిగా, నా గత జీవితంలో కన్పించిన వారంతా స్త్రీ వంచితులే - కాని పురుష వంచితలూ కన్పించటం మొదలెట్టారు.

ఆరోగ్యం నుండి కోలుకొంటున్న రోజులలో చూస్తూ వుండేవాడిని భారతిని. ప్రతినిత్యమూ, తన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించేది. పూజా పునస్కారాలతో కాలాన్ని వెళ్ళతీసేది. మనసా, వాచా, కర్మాణా, ఏ ప్రాణికీ కీడు సహించేది కాదు. ఆమె మూర్తీభవించిన కరుణ, క్షమ, దయ, నిశ్చలాంతః కరణ ఆమె నంటిపెట్టుకొని ప్రకాశించాయి.

భారతి సమక్షంలో, ఆమె సేవలో నేను మనిషినయ్యాను. నాలో నూతనత్వం ప్రారంభమయింది... స్త్రీ జాతి పట్ల నాలో పెనవేసికొన్న భావనలు సడలి విడి వడి "భారతి" ముందు నిలువలేక జారిపోవటం ప్రారంభించాయి.

భారతి పండ్ల రసం తీసి ఇచ్చింది. 'కాదు కాఫీ కావా'లన్నాను.

"వీల్లేదు. మీ ఆరోగ్యాన్ని కాఫీతోనే పాడుచేసికొన్నారు" అంది.

"మీకెందుకీ శ్రద్ధ...?" అన్నాను.

"కర్తవ్యం" అంది.

"బాటసారిని, నా పట్ల మీ కెందు కీ కర్తవ్య నిర్వహణ?"

భారతి అదోలా చూచింది.

"మురారి గారూ! స్త్రీకి ప్రకృతి మాతృత్వాన్ని ప్రసాదించింది. ఆ పవిత్ర

కర్తవ్యాన్ని విస్మరిస్తే భగవంతుడు క్షమించడు" అంది భారతి.

స్త్రీ... మాతృమూర్తి!!! నాలోని గత స్త్రీ మూర్తులు మాసిపోయాయి.

★ ★ ★

నా జబ్బు విషయం తెలిసి బాబాయి పరుగెత్తుకొని వచ్చారు. నా బ్రతుకు బాటలో వెలుగు దివ్వెలా ఆయనొకరు. వస్తూనే చిక్కి సగమైన నన్ను చూచి కంట తడి పెట్టారు, 'కాని దేశంలో నీ కెంత కష్ట మొచ్చిందిరా నాయినా' అంటూ. 'కాని దేశం' అనే మాట వినగానే మనస్సు చివుక్కుమంది. భారతి వాత్సల్యాన్ని అనుభవించిన ఆ ఊరు "కాని దేశం" అనిపించలేదు. బాబాయి వస్తూనే నాకు గుంటూరు బదిలీ చేయించుకొని కాగితం పట్టుకొని వచ్చారు.

ఆ మరునాడే శివకామయ్యగారితో మాట్లాడి, నా ప్రయాణానికి ముహూర్తాన్ని నిర్ణయించారు. శుక్రవారం నాటి తెల్లవారు జామున 4 గంటల బస్సులో బయలు దేరటానికి నిర్ణయం జరిగింది.

భారతి, కరుణామూర్తి, సమక్షం నుండి వెళ్ళిపోవటానికి మనస్సు అదోలా అనిపించింది.

ఆనాటి సాయంకాలం బాబాయీ, శివకామయ్య గారూ గోదావరి కేసి వెళ్లారు. భారతి వచ్చింది. నేను పాటించవలసిన విధులంటూ ఏకరువు పెట్టటం ప్రారంభించింది- "రాత్రి 9 గంటలకు నిద్రించాలి.... సిగరెట్లు కాల్చకూడదు, కాఫీ మానివేయాలి" - ఇలా చెప్పుకొనిపోతోంది.

నాలోని ఆలోచనలు బైర్లు క్రమ్మినట్లు మరో దిక్కుగా సాగాయి... భారతి కేసి!!! దిక్కులేని వారికి దిక్కైన భారతి అలా నీరు లేక ఎండిపోయే లతలా నశించిపోవలసిందేనా? ఏనాడో తన జీవిత వసంతంలో నిప్పులు పోసి తప్పుకొన్న రాజారావుతో భారతి కింకా ఏమిటి పని...?

ప్రవాహంలా నా ఆరోగ్యాన్ని గురించి చెపుతున్న భారతిని ఆపి 'అదే' అడిగాను. ఆమె మౌనం వహించింది. అక్కడి నుండి వెళ్ళి పోయింది.

భగవంతుడు కొన్ని జీవితాలనెందుకిలా చేస్తాడో అర్థం కాలేదు. భారతిలాంటి నిర్మల స్త్రీ మూర్తికి ఏమిటీ శిక్ష?

"కరుణకు గాయం! దయకు హింస! మధురతకు విషం, భారతికి ఎడారి జీవితం... ఏమిటీ విపరీతం? ఆ జన్మ అలా నశించి పోవాల్సిందేనా?"

ఆ రాత్రి పెట్టె, బెడ్డింగు సర్దుకొని ప్రయాణానికి సిద్ధమయ్యాం. రాత్రి 11 గంటలకు బాబాయి నిద్ర పోతున్నారు. ఒంటరిగా దీపం ముందు కూర్చొని నా భద్రాచలం జీవితాన్ని సమీక్షించు కొంటున్నాను.

చప్పుడయింది తలుపు దగ్గర.

భారతి! చేతిలో ఏదో కవరుతో భారతి.

వాతావరణం ప్రశాంతంగా వుంది. బాబాయి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తప్ప మరే అలికిడి లేదు. భారతి ఏదో చెప్పాలని ప్రయత్నించింది... కాని చెప్పలేక పోయింది. ఆమె కనుకొలకుల నుండి అశ్రుబిందువులు జాలువారటం గమనించాను.

ఏమిటి భారతి దు:ఖిస్తూందా?

"ఏం, భారతీ!" అన్నాను.

"నన్ను గుర్తుంచుకొండి," అంటూ, ఆ కవరు నా ముందుంచి వెళ్ళి పోయింది.

నా కనులు చెమ్మగిల్లాయి.

తెల్లవారు జామును 4 గంటలకు బాబాయి, నేను ప్రయాణమైనాము. శివకామయ్యగారి దగ్గర సెలవు తీసికొన్నాను. "ఆరోగ్యం జాగ్రత్త నాయినా" అన్నారాయన. బస్సుస్టాండుకేసి గుర్రపుబండి కదిలింది.

★ ★ ★

బస్సు ఆవులించి తన ప్రయాణాన్ని సాగించింది.

ప్రకృతి స్త్రీలోని కరుణా స్రవంతిలా చల్లగా, స్త్రీలోని క్షమలా హాయిగా వుంది.

భారతి ఇచ్చిన కాగితమోసారి విప్పాను.

"మురారి బాబూ! మీరు నా జీవితంలో మళ్ళీ వసంతం రావాలి అన్నారు. అంతేగాని స్త్రీని గురించి, ఏ మాత్రం ఆలోచించారు...? స్త్రీ జీవితంలో ఒక్కసారే

పవిత్ర బంధాలను స్వీకరిస్తుంది. అంతే. ఆనాటినుండి ఆమె జీవితం ఆ పవిత్ర బంధాలకు అంకితమౌతుంది.

ఇందులోని ఫోటోలోని వారే!... వారు... ఎక్కడైనా, ఎప్పుడైనా మీకు కన్పిస్తే, ఈ భారతి ఎదురు తెన్నులు చూస్తోందని.... ఈ మనస్సు, తనువు, కర్మ అన్నీ వారికే నివేదించిందని నా మనవిగా తెల్పండి. - భారతి"

బస్సు ఏదో కొండెక్కుతోంది. ఎత్తుగా కానవచ్చే ఆ పర్వత శిఖరాల ద్వారా స్త్రీ ఔన్నత్యాన్ని అర్థం చేసుకోవడానికి యత్నించాను. ●

## కథ వెనుక కథ :

*సరిగ్గా గుర్తు లేదు. ఎవరో చెప్పారు. వదలి వెళ్లిన భర్త కోసం పదిహేను సంవత్సరాలుగా ఎదురు చూస్తోన్న ఆ స్త్రీ మూర్తిని గురించి.*

*భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే కథల నాహ్వానించిన జాగృతి 1962 దీపావళి కథల పోటీలకి పంపిన కథ, ఇది.*

*'స్త్రీ హృదయం' అనే పేరుతో ప్రథమ బహుమతిగా ఇచ్చి ప్రచురించారు. కథకు నేను మొదట పెట్టిన 'భారతి' అనే పేరుతోనే ఇప్పుడు ప్రచురిస్తున్నాను.*

★ *(జాగృతి, దీపావళి 1962)* ★

